సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా కడప ఏరోడ్రమ్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. -8లో

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 9.45 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సభా భవనంలో నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

10 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయని ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్స్‌ను మన మిత్ర ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకట సుబ్బయ్య తెలిపారు. హాల్ టికెట్స్‌ను కాలేజ్ లాగిన్‌లో, పబ్లిక్ డొమైన్ https://bie.ap.gov.inలో ఉన్నాయని వివరించారు.

నేడు, రేపు వైఎస్సార్ జిల్లా రచయితల సభలు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం రెండవ మహాసభలు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. కడప నగరంలోని ఐఎంఏ హాలులో ఈ రెండు రోజులు ప్రత్యేక వేదికలపై సభలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీకృష్ణ దేవరాయల సభా వేదికపై సాహిత్యవేత్త ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరగనున్న సభకు మరో సాహితీవేత్త డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఆచార్య శలాక రఘునాథశర్మ, షేక్ హుసేన్ సత్యాగ్ని, డాక్టర్ నరాల రామారెడ్డి, సినీ నటులు శివకృష్ణ, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, అలపర్తి పిచ్చయ్యచౌదరి, జింకా సుబ్రమణ్యం సందేశాలు ఇవ్వనున్నారు. ప్రధాన వక్తగా కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పలు సాహిత్య గ్రంథాలను ఆవిష్కరించనున్నారు. శనివారం మధ్యాహ్నం 3.15 గంటలకు 66 మంది ఎంపిక చేసిన కళాశాల విద్యార్థుల కవితాగానం ఉంటుంది.

పోయేవాళ్లు పోండి

- ఉన్నవాళ్లతో పనిచేయించుకుంటాం
- అధికారులను బెదిరించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి



సాక్షి,టాస్క్‌ఫోర్స్: ఆయన ప్రజా ప్రతినిధి కాదు....ఉన్నతాధికారి అంతకంటే కాదు....అయినా సరే అధికారులను వేలు చూపెట్టి బెదిరిస్తారు...పనిచేయకపోతే వెళ్లిపోండని హెచ్చరిస్తారు...ఆయన ఎవరో కాదు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి. వాస్తవానికి ఆయనకు ఎలాంటి ప్రొటోకాల్ లేదు...కడప శాసన సభ్యురాలికి ఆమె భర్త మాత్రమే. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టే ఆయన హవా ఇలా కొనసాగుతోందని నగరవాసులు గుసగుసలు పోతున్నారు. బహిరంగంగా అధికారులను ఆయన బెదిరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

శుక్రవారం 11వ డివిజన్‌లో 'మన కడప -స్వచ్ఛ కడప'లో పాల్గొన్న ఆయన అధికారులతో మాట్లాడుతూ పనిచేయని వాళ్లను ఉపేక్షించేది లేదని, గునపం పెట్టి రుద్దుతూనే ఉంటామని హెచ్చరించారు. ఒత్తిడి ఉందని చెబితే కుదరని, ఒంగోబెట్టి పనిచేయిస్తామని అన్నారు. పోయిన వాళ్ల బెనిఫిట్లు పక్కనబెట్టిస్తామని బెదిరింపులకు దిగారు. అధికారులను ఉద్దేశించి టీడీపీ జిల్లా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోఉన్నప్పుడు ప్రజా ప్రతినిధులైనా సరే అధికారులను ఇలా బహిరంగంగా బెదిరించిన దాఖలాలు లేవు. టీడీపీ జిల్లా అధ్యక్షుడి మాటలు విని ఔరా...అధికారులను అనడానికి ఈయనకు ఏం హక్కుందని నగరవాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

సెలవులో వెళ్లిన సీపీ రమణ? ...అదే బాటలో మరికొందరు

కడప నగరపాలక సంస్థ సిటీప్లానర్ రమణ సెలవులో వెళ్లినట్లు తెలిసింది. గురువారం మాసాపేట దళిత వాడలో వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజుకు చెందిన వాటర్‌ప్లాంటు కూల్చివేయించాలని అధికారపార్టీ నేతలు, కమిషనర్ తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. దీన్ని మేయర్ సురేష్ బాబు స్వయంగా రంగంలోకి దిగి అడ్డుకున్నారు. తమకు ముందుగా నోటీసు ఇవ్వాలని, ఆ తర్వాతే కూల్చాలని పట్టుబట్టారు. నాలుగేళ్లక్రితం కట్టిన వాటర్‌ప్లాంటుకు ఇప్పుడు నోటీసులు ఇస్తే తాము ఇరుక్కుంటామని భావించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అందుకు ససేమిరా అన్నారు. అధికార పార్టీ నేతల నోటి మాటే శాసనంగా పోలీసుల సాయంతో కూల్చివేయాలని చేసిన ప్రయత్నాలు సాగలేదు. మాసాపేట దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ ప్రాంత సర్వే నంబర్లను కేబినెట్‌లో ఆమోదించి క్లాసిఫికేషన్ రెవెన్యూకు మార్చి ఇంటి స్థలాలు ఇచ్చారు. అర్హుల జాబితా కూడా పక్కాగా ఉంది. లబ్ధిదారుల్లో ఒకరైన త్యాగరాజు తనకు కేటాయించిన స్థలంలో వాటర్ ప్లాంటు నిర్మించుకొని రూ.5లకే సురక్షిత నీరు అందిస్తున్నారు. నగరపాలక సంస్థ ఆ ప్లాంటుకు డోర్ నంబర్ కేటాయించి, ట్రేడ్ లైసెన్సు కూడా మంజూరు చేసింది. ప్రభుత్వ పరంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా తాము ముందుండి వాటర్‌ప్లాంటు కూల్చివేస్తే ...చట్టం ముందు తాము దోషులుగా నిలబడక తప్పదని టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మరుసటి దినమే సిటీప్లానర్ రమణ పదిరోజులు సెలవుపెట్టి వెళ్లినట్లు సమాచారం. సోమవారం మరికొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా సెలవులో వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే నగరపాలన పడకేయక తప్పదు.

హామీలు అమలు చేయలేక దుష్ప్రచారం

- 9నెలల కూటమి పాలనలో ప్రజల్లో అసంతృప్తి
- ప్రజా దర్బార్‌లో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేక రాష్ట్రవ్యాప్తంగా ప్రజలపై దుష్ప్రచారాలు చేస్తోందని.. 9 నెలల కూటమి పాలనలో ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలో తన నివాసంలో ఎంపీ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మోసాలను ఎండగట్టే విధంగా కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల కాలంలో అదనంగా 75వేల మెడికల్ సీట్లు ఇస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ మెడికల్ సీట్లు వద్దని సీఎం చంద్రబాబు లేఖ రాయడం ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల రాష్ట్రంలోని పేద విద్యార్థులకు తీరని నష్టం జరుగుతోందన్నారు. సంపద సృష్టించడం తనకు తెలుసంటూ ప్రచార ప్రచారం చేసుకున్న చంద్రబాబు కేవలం అప్పులతోనే కాలం వెల్లదీస్తున్నారని.. 9 నెలల కూటమి పాలనలో ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారన్నారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతి పత్రాలను తీసుకున్నారు. వాటిని పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కడప రాయునికి పుష్పయాగం



కడప రాయునికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

నల్లనయ్య అందాన్ని చూసి తెల్లబోయిన మల్లెలు, కలువలు... ఆయన నాజూకు తనం చూసి సిగ్గుల మొగ్గ సన్నజాజులు, ఎంత చక్కని రూపమంటూ రేకులు విప్పార్చుకుని చూస్తున్న సంపెగలు, ఆ సుకుమారుడిని తాకి మరింత మృదువుగా మారిన గులాబీలు, ఆ దివ్య సన్నిధిలో చోటు లభించినందుకు అంబరాన్ని అంటిన సంబరంతో కనకాంబరాలు, అది భాగ్యమని పరవశిస్తున్న బంతులు, చామంతులు ఇంకా...ఇంకా...ఎన్నెన్నో పూలు, ఎన్నెన్నో సువాసనలు... ఇదీ కడప రాయుడి సన్నిధిలో శుక్రవారం కనువిందు చేసిన దృశ్యం. శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పుష్పయాగం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ కార్యక్రమం భక్తులను పరవశింపజేసింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పీఠంపై ఇరువైపుల దేవేరులతో కొలువుదీరిన వీరికి ప్రత్యేక పూజలు చేసి యాగాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్ సహాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, మాజీ చైర్మన్లు, పాతకడప, దేవునికడప గ్రామాల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. – కడప కల్చరల్



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

నిరుద్యోగులకు టోకరా

కడప అర్బన్ : ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఓ ఏఆర్ కానిస్టేబుల్ మోసం చేసినట్లు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓంశాంతి నగర్‌లో నివాసముంటున్న ఏఆర్ కానిస్టేబుల్ 2019–20 మధ్యకాలంలో పెండ్లిమర్రి మండలం, ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాల ఆశ చూపారు. వారి నుంచి డబ్బు వసూలు చేశారు. అనంతరం ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన యువకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మోరగుడిలో కొండ చిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న జనం

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని మోరగుడిలో గత వారం రోజులుగా ఓ కొండ చిలువ తిరుగుతోంది. కోళ్లను, మూగ జీవాలను ఆహారంగా తినేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని రచ్చబండ వద్ద ముళ్ల పొదల్లో తిరుగుతూ కదలలేని పరిస్థితిలో ఉండడంతో స్థానికులు కొండ చిలువను రాళ్లు, కర్రలతో కొట్టి చంపివేశారు. సుమారు 10 అడుగుల నుంచి 12 అడుగుల మేర ఉందని, ముళ్లపొదల్లో వేసి కాల్చివేశామని వారు తెలిపారు.

మామపై అల్లుడు దాడి

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్న పఠాన్ మక్బుల్‌బాషాపై అతని అల్లుడు పఠాన్ షారుక్‌ఖాన్, రఫీ ఖాన్ దాడి చేశారు. వారు మధ్య కుటుంబ తగాదాలు ఉండడంతో ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాహిర్ హుస్సేన్ తెలిపారు

11 గ్యాస్ సిలిండర్లు పట్టివేత



గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న గీతావాణి

కమలాపురం : పట్టణంలోని క్రాస్ రోడ్డుతో పాటు పందిళ్లపల్లె వద్ద ఉన్న హోటళ్లపై డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గీతావాణి రెవెన్యూ సిబ్బందితో కలసి శుక్రవారం దాడులు నిర్వహించారు. క్రాస్ రోడ్డులోని సుధాకర్‌రెడ్డి హోటల్‌లో నాలుగు భారత్ గ్యాస్ ఖాళీ సిలిండర్లు పట్టుకున్నారు. పందిళ్లపల్లెలోని ఎస్ఎస్ఆర్ ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్ నుంచి ఏడు భారత్ గ్యాస్ సిలిండర్లు పట్టుకుని ఏజెన్సీ వారికి అప్పగించారు. 6(ఎ) కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఆర్ఐ జహీరుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : కడప ఏరో డ్రమ్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఏరో డ్రమ్, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటీ, సౌకర్యాలు, నీటి సదుపాయం, రోడ్లు తదితర విషయాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన టెర్మినల్ భవన అభివృద్ధి పనుల అనంతరం కడప విమానాశ్రయం అత్యుత్తమ శ్రేణి ఎయిర్ పోర్ట్ అవుతుందన్నారు. పర్యావరణ, అటవీ శాఖ అనుమతులను పరిశీలించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏరో డ్రమ్‌లో భద్రతా వాహనాల ఏర్పాటు, ఎయిర్ పోర్ట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోనూ కడప మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ శాఖ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, విమానాశ్రయం డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఎయిర్ పోర్ట్ డీజీఎంలు రాజశేఖర్, శ్రీధర్, నిఖిల్, ఎస్.జోబన్న, డాక్టర్ కె.నాగరాజు, శారదమ్మ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

ఈ నెల ఫిబ్రవరి 10వ తేదీన 1–19 వయస్సుగల పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. నులి పురుగుల నియంత్రణ కీలకమైన అంశమని, నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 5,20,000 మాత్రలను అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. ఆల్బెండజోల్ మందు విషయంలో తల్లిదండ్రులు అపోహలు వీడాలన్నారు. నులిపురుగుల నివారణపై మండల, జిల్లా స్థాయిలో ర్యాలీ, మారథాన్ రన్, అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం గోడ పత్రాలను అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. 10న వేసుకోని వారికి 17వతేదీన ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ నాగరాజు, కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఐడీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు.

వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లో తాగునీటి అవసరాల సన్నద్ధతపై ఇంజినీర్లు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీరందించేందుకు పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, ఈఈ విజయ్ భాస్కర్, పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, ఈ ఈ చిదానంద రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువత ఆరోగ్యం పదిలం

వైవీయూ వీసీ క్రిష్ణారెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కమలాపురం : క్రీడలు సభ్యత, సంస్కారం నేర్పుతాయని, యువకుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైవీయూ వీసీ ఆచార్య క్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డితో కలిసి వైవీయూ అంతర్ కళాశాలల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి పెడతాయని, వాటితో పాటు జిమ్, వ్యాయామం, యోగా, వాకింగ్ లాంటివి చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. క్రీడలు నిర్వహించి ఇప్పటివరకు రూ.25 లక్షల ప్రోత్సాహక బహుమతులు అందించిన రాజగోపాల్‌రెడ్డి అభినందనీయుడు అన్నారు. వైవీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు ఒకేలా స్వీకరించాలని, గెలవగానే పొంగిపోవడం, ఓడిపోగానే కుంగిపోవడం చేయరాదన్నారు. అనంతరం బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలను నిర్వహించారు. శనివారం ఈ పోటీలు ముగుస్తాయని ప్రిన్సిపల్ వినోద్ కుమార్ తెలిపారు.

గండిలో హుండీ ఆదాయం లెక్కింపు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో హుండీలను శుక్రవారం లెక్కించినట్లు ఆలయ సహా య కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆలయంలోని ఏడు శాశ్వత హుండీల ద్వారా రూ.17,00,750, అన్నదాన సత్రంలో హుండీ ద్వారా రూ.30,065ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 000.004.000 గ్రాముల మిక్స్‌డ్ బంగారు, 000.320.000 గ్రాముల మిక్స్‌డ్ వెండి వస్తువులతోపాటు, రెండు అమెరికన్ డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ కావలి కృష్ణతేజ, అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, కడప దేవాదాయశాఖ పర్యవేక్షకురాలు భారతి, వెంకటస్వామి, పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతి చెందిన బ్రహ్మతేజ

ప్రొద్దుటూరు క్రైం : రామేశ్వరం బైపాస్ రోడ్డులోని ఓ ఇటుకల బట్టీలో పనపాక బ్రహ్మతేజ (30)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బ్రహ్మతేజ రెండు నెలల కిందట ముగ్గురు పిల్లలు కలిగిన వివాహితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తలు ఇరువురూ శ్రీనివాసులురెడ్డి అలియాస్ బెంగళూరు శ్రీనుకు చెందిన ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బ్రహ్మతేజ ఇటుకలబట్టీలోని ఓ గదిలో ఉరి వేసుకుని విగత జీవిగా పడి ఉన్నారు. శ్రీనివాసులరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బ్రహ్మతేజ చనిపోయినట్లు తెలిపారు. ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ బ్రహ్మతేజ తల్లి సంధ్యావతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి చేశారంటూ ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల కస్పాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ సలీం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అత్తర్ అహ్మద్‌బాషాపై దాడి చేశారని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురూ తెలుగు దేశం పార్టీకి చెందిన వారే. అయితే అత్తర్ అహ్మద్ బాషా టీడీపీకి చెందిన సుగవాసి బాలసుబ్రహ్మణ్యం వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఇతడిని తొలగించారు. జగన్‌మోహన్‌రాజు వర్గానికి చెందిన సాగా సలీంను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. సలీం అక్రమాలకు పాల్పడుతున్నాడని అత్తర్ అహ్మద్ బాష ఇటీవల బయటపెట్టారు. దీంతో అహ్మద్ బాషాపై ఆగ్రహంతో దుర్భాషలాడుతూ షేక్ సలీం దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారిస్తున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో వెండివస్తువులు, నిందితులు

నందలూరు : కడప–తిరుపతి ప్రధాన రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ.99 వేల విలువగల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ వాగ్దే తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లగా తలారి బాలకృష్ణ, పుర్లగుంట రామాంజి అనే వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని ఆరా తీయగా సంచిలో మూడు వెండి కిరీటాలు, రెండు వెండి పళ్లేలు, మూడు వెండి దీపాలు, ఒక శఠగోపం లభించాయి. ఆడపూరు గ్రామంలోని మంచాలమ్మ ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 24న చోరీ చేసిన వస్తువులుగా వాటిని గుర్తించడం జరిగిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్ బాషాను ఏఎస్పీ అభినందించారు. రాజంపేట రూరల్ సీఐ బీవీ.రమణ, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి బంగారు గొలుసు చోరీ



బాధితురాలిని విచారిస్తున్న కమలాపురం సీఐ ఎస్కే రోషన్

వల్లూరు : మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో బెదిరించి బంగారు గొలుసు లాక్కెళ్లాడు. సి.కొత్తపల్లెకు చెందిన కాంతమ్మ వల్లూరు–సికొత్తపల్లె మధ్య ఓ చెరువు సమీపంలో పశువులను మేపుకుంటోంది. ముఖానికి మాస్క్ ధరించిన ఓ యువకుడు ఆమె మెడలో మూడు తులాల బంగారు గొలుసు లాక్కున్నాడు. ఆమె అరవబోగా చంపుతానంటూ కత్తితో బెదిరించి బైక్‌లో పరారయ్యాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.కె.రోషన్, ఎస్ఐ ప్రతాపరెడ్డి చోరీ విషయమై విచారించారు. దుండగుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న ఆటో

– ఎనిమిది మంది కూలీలకు గాయాలు

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రహదారిలో బొలెరో వాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో కూలీలు గాయాలపాలైన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. ముద్దనూరు ప్రాంతం నుంచి జమ్మలమడుగులో శనగ పంట కోత కోసేందుకు ఆటోలో కూలీలు జమ్మలమడుగుకు వస్తున్నారు. మార్గమధ్యంలో ముద్దనూరు రహదారిలో అయ్యప్పస్వామి ఆలయం వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ వేగం అదుపు చేసుకోలేక బొలెరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో 13 మంది వ్యవసాయ కూలీలు గాయాలపాలయ్యారు. ఆటో డ్రైవర్ నాగమునిని వేగంగా నడపవద్దని వారించినా వినలేదని కూలీలు వాపోయారు. 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆయమ్మ తోసింది.. బాలుడి ఎముక విరిగింది

చిట్వేలి : అన్నం అడిగితే ఆయా బాలుడిని తోసేయడంతో అతడి ఎముక విరిగిపోయిన సంఘటన శుక్రవారం నేతివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన బాలుడు ఆకలై అన్నం అడిగారు. ఆయమ్మ ఆగ్రహంతో తోసేయడంతో కింద పడిపోయాడు. బాలుడు గౌతమ్‌కు కుడి వైపు, మెడ, భుజం మధ్యలో ఎముక విరిగిపోయిందని తల్లి నలగల చంద్రకళ తెలిపారు. అంగన్ వాడీ వర్కర్ జ్యోతి రెండు రోజులుగా సెలవులో ఉన్నట్లు బాలుడి తల్లి చంద్రకళ తెలిపారు. గౌతమ్‌ను రైల్వేకోడూరు మండలం ఫారంకు తీసుకెళ్లి కట్టు కట్టించినట్లు తెలిపారు. సీడీపీఓ రాజేశ్వరి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. కావున అధికారులు స్పందించి న్యాయం చేయాలని తల్లి చంద్రకళ కోరుతున్నారు.

రహదారిపై కొండ చిలువ



రోడ్డు దాటుకుని వెళుతున్న కొండచిలువ

రాజుపాళెం : రాజుపాళెం–అయ్యవారిపల్లె రహదారిలో కేసీ చాపాడు కాల్వ వద్ద శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి 7.30 గంటల సమయంలో రహదారిపై ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్తున్న కొండచిలువను చూసి వాహనదారులు భయపడిపోయారు. కొంతసేపు ఆగి.. కొండ చిలువు వెళ్లిన తర్వాత ఇళ్లకు వెళ్లారు.

గుండె పోటుతో ప్రయాణికుడి మృతి



మృతి చెందిన నాగయ్య

కొలిమిగుండ్ల : ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ఓ ప్రయాణికుడు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం వేపరాలకు చెందిన నాగయ్య(43) పని నిమిత్తం తాడిపత్రికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో జమ్మలమడుగు డిపో బస్సు ఎక్కాడు. కండక్టర్ టికెట్లు ఇచ్చే సమయంలో బాగానే ఉన్నాడు. చివరి సీటు ఖాళీగా ఉండటంతో నాగయ్య పడుకున్నాడు. కొద్ది సేపటికే గుండె పోటు రావడంతో సీటు కిందకు పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత సీటు కింద పడిపోయిన వ్యక్తిని తోటి ప్రయాణికులు గుర్తించి లేపినా లేవలేదు. మద్యం సేవించి పడిపోయాడని భావించి ముఖంపై నీళ్లు చల్లినా ఎలాంటి స్పందన లేదు. బస్సు కొలిమిగుండ్ల బస్టాండ్‌కు వచ్చాక విషయాన్ని డ్రైవర్, కండక్టర్ దృష్టికి ప్రయాణికులు తీసుకెళ్లడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు బస్సు తీసుకెళ్లారు. అక్కడే ఓ ప్రవేట్ వైద్యుడిని చూపించగా గంట క్రితమే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని కండక్టర్ పోలీసులకు తెలియజేసి, మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

టీడీపీ నేతలు దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారు



తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న చెన్నమరాజుపల్లె గ్రామస్తులు

ప్రొద్దుటూరు : తమ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు రాజువారి వెంకటసుబ్బయ్య, రాజువారి రామాంజనేయులు తమ స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేయాలని ప్రయత్నిస్తున్నారని చెన్నమరాజుపల్లెకు చెందిన పేరం చంద్రశేఖర్, పేరం గంగయ్య, పోలిబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం తహసీల్దారు గంగయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలోని బీసీ కాలనీలో టీడీపీ నేతలు కొంత స్థలాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశారన్నారు. ఇపుడు తమ స్థలంలో రోడ్డు వేసి వారి స్థలానికి విలువ తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతేడాది ఇదే విషయంపై అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రస్తుతం పోలీసుల ద్వారా తమపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. రూరల్ సీఐ బాలమద్దిలేటి తమను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని, అక్కడ కూడా ఇదే విషయం తెలిపామన్నారు. సర్వే నంబర్ 232/బీ1, బీ2లలో తమకు ఒక్కొక్కరికి 4 సెంట్ల స్థలం కలిపి మొత్తం 12 సెంట్లు ఉందన్నారు. అధికార పార్టీ బలంతోనే తమపై ఒత్తిడి తెచ్చి ఏదో విధంగా రోడ్డు వేయాలని చూస్తున్నారన్నారు. ఫ్యాక్షన్ గ్రామమైన చెన్నమరాజుపల్లెలో ప్రతి విషయంపై అధికారులు క్షుణ్ణంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జ్యోతి క్షేత్రాన్ని కాపాడుకుందాం



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న హిందూ సంఘాల నాయకులు, భక్తులు

కాశినాయన : జ్యోతి క్షేత్రంలో దేవాలయాల నిర్మాణాలను కూల్చివేయడాన్ని అడ్డుకుందామని అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు నీరజానంద స్వామి, సాధుసంతుల పరివార్ అధ్యక్షుడు శివకుమారస్వామి, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర భజరంగదళ్ సెక్రటరీ సందీప్ పిలుపునిచ్చారు. జ్యోతి క్షేత్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాశినాయన భక్తులతో శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఆలయాలను పునరుద్ధరించి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటుచేసిన అవధూత కాశినాయన ఆలయాన్ని అటవీశాఖాధికారులు కూల్చడం దారుణమన్నారు. నెలకోసారి ఆశ్రమానికి వచ్చి కొన్ని నిర్మాణాలను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కాశినాయన ఆశ్రమ నిర్మాణం దాదాపు పన్నెండున్నర హెక్టార్లలో జరిగిందని భక్తులు తెలిపారు. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి ఆధ్వర్యంలో అప్పటి కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి ఆలయానికి అవసరమైన భూమి కంటే రెట్టింపు భూమి అటవీశాఖకు ఇస్తామని చెప్పారని వారు పేర్కొన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి సత్యకుమార్, ఎంపీ సీఎం.రమేష్ భూపేంద్రయాదవ్‌ను కలిసి ఆలయ నిర్మాణానికి అనుమతులివ్వాలని కోరారన్నారు. అది పరిశీలనలోనే ఉంది. అయినా అటవీ అధికారులు ఆలయాన్ని కూల్చివేయాలని ఆదేశాలివ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరుగు పోటీల వేదిక మార్పు



టీషర్ట్ విడుదల చేస్తున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు ఆదివారం నిర్వహించనున్న పరుగు పోటీల వేదికను జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ వద్దకు మార్చినట్లు కొవ్వూరు గ్రాండ్ ఛైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక కొవ్వూరు గ్రాండ్‌లో ప్రొద్దుటూరు 3కే, 5కే రన్ పోటీల టీషర్ట్‌లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో తనకు యువతి స్వప్న కాలేయం దానం చేశారని, అప్పటి నుంచి అవయవదానంపై అవగాహన పెంచేందుకు పరుగు పోటీలు నిర్వహిస్తున్నానని తెలిపారు. పాల్గొన్న వారికి టీషర్టు, రన్నింగ్ పూర్తి చేసిన వారికి మెడల్స్, సర్టిఫికేట్, విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. అల్పా హారం ఏర్పాటు చేశామని, క్రీడాకారులు ఆదివారం ఉదయం 6.30కు రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లై ఓవర్ వద్దకు చేరుకోవాలని కోరారు.

మదనపల్లెలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

నేడు మదనపల్లె కోర్టు ఆవరణలో నూతన భవనాలు ప్రారంభం

మదనపల్లె : మదనపల్లె కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్ కోర్టు భవనాలను ప్రారంభించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వెంకటనారాయణభట్ మదనపల్లెకు చేరుకున్నారు. రాష్ట్ర సరిహద్దులోని చీకలబైలు చెక్ పోస్టు వద్ద జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమరావు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ కొండయ్యనాయుడు న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. సొసైటీ కాలనీలోని ఇంటి వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కోర్టుభవనాల ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ధీరజ్‌సింగ్‌ఠాగూర్, హైకోర్టు న్యాయమూర్తులు డి.క్రిష్ణమోహన్, కుంచం మహేశ్వరరావు, టి.సి.డి.శేఖర్‌లు మదనపల్లెకు చేరుకుని హార్సిలీ హిల్స్‌లో బసచేశారు. శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వెంకటనారాయణభట్‌తో కలిసి కోర్టు భవనాల ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు కోర్టు అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జడ్జి ఈ.భీమరావు, మదనపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొట్టి వెంకటరమణారెడ్డి తెలిపారు.

నగర దీపికలపై వేటు..!

ఈ దివ్యాంగురాలి పేరు గాలి సావిత్రి. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని టూటౌన్ బైపాస్ రోడ్డులో ఉన్న థర్డ్ కాలనీ పార్కులో రోజూ చెత్తను శుభ్రం చేస్తోంది. తద్వారా తన తల్లి వీరమ్మను పోషించుకొంటోంది. ఇంటర్మీడియట్ వరకు చదివిన ఈమె 2011 నుంచి పనిచేస్తున్నారు. త్వరలో ఈమెను తొలగించనున్నారు.



మున్సిపాలిటీ నుంచి త్వరలో 25 మంది తొలగింపు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 25 మంది మహిళలు నగర దీపికలుగా పనిచేస్తున్నారు. 2011 అప్పటి మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ వారిని నియమించారు. విధుల్లో చేరిన మొదట్లో వీరు ఇంటింటా తిరిగి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఆరుబయట మల విసర్జన చేయకుండా ప్రచారం చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రస్తుతం రోడ్ల వెంబడి ఉన్న డివైడర్లలో ఉన్న చెత్తను తొలగించడం, పట్టణంలోని గాంధీ పార్కు, వైఎంఆర్ కాలనీ పార్కు, టూటౌన్ బైపాస్ రోడ్డు పార్కు, రామేశ్వరం పార్కులలో పనిచేస్తున్నారు. దసరా ఉత్సవాలు వచ్చినప్పుడు వారికి ప్రత్యేక విధులు కేటాయిస్తున్నారు. తొలుత వాలంటీర్‌గా నియమితులైన వీరికి తర్వాత గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.12వేలు చెల్లిస్తున్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు వీరిని యథావిధిగా కొనసాగిస్తున్నారు. వీరంతా దాదాపు నడి వయసు ఉన్న మహిళలే. ఈ వేతనాలపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇంత కాలం యథావిధిగా కొనసాగిన వీరిని త్వరలో తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ఈ విషయంపై వీరు పలు మార్లు ఎమ్మెల్యే నంద్యాల వరాజులరెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవించారు.

ఆడిట్ అభ్యంతరాలు వస్తున్నాయి



నగర దీపికల నియామకానికి సంబంధించి ప్రతి మారు ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీరికి వేతనాలు చెల్లించే ప్రతి సందర్భంలోనూ తమకు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏ ప్రాతిపదికన ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా నియమించారో తెలియడం లేదు. బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని తొలగించాలని నిర్ణయించాం. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులకు సంబంధించి కూడా ఇలాంటి సమస్యే ఉత్పన్నమవుతోంది. ఈ విషయంపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు